క్లుప్తంగా

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానంతో ఎదుటవారి ప్రాణాలు కాపాడవచ్చని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాదరావు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో జన్ భాగీదరి కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆపదలో ఉన్న సాటి మనిషికి రక్తం ఇచ్చి ప్రాణం కాపాడే అవకాశం మనుషులకే ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యం, గౌరీశంకర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సీఐగా రంగనాథం



పైడి రంగనాథం, ట్రాఫిక్ సీఐ

విజయనగరం క్రైమ్: విజయనగరం ట్రాఫిక్ సీఐగా పైడి రంగనాథం శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో నీలకంఠాపురం, గజపతినగరంతో పాటు పలు పోలీస్ స్టేషన్‌లలో ఎస్సైగా పనిచేసి ప్రజలు, అధికారుల నుంచి మంచి గుర్తింపు పొందారు. సీఐగా ఉద్యోగోన్నతి పొందిన తర్వాత అనకాపల్లి జిల్లాలో సీసీఎస్, సబ్బవరం పీఎస్‌లో పనిచేసి తాజాగా ట్రాఫిక్ సీఐగా వచ్చారు. ఈ మేరకు రంగనాథాన్ని ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ఎస్సైలు, సిబ్బంది అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



రామగణేష్, ఎస్సై

నెల్లిమర్ల: నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా డి.రామగణేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. రామగణేష్ విజయనగరం ఒకటో పట్టణ ఎస్సైగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన పి. నారాయణరావు దిశ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీ వెళుతున్న నారాయణరావుకు సహచర సిబ్బంది వీడ్కోలు పలికారు.

దళితుల సంక్షేమానికి సీఎం కృషి

- రెల్లి కుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు మురళీమోహన్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మురళీమోహన్

విజయనగరం ఫోర్ట్: దళితుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రెల్లికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు సోము మురళీమోహన్ అన్నారు. ప్రభుత్వం ఈ నెల 19వ తేదీ నుంచి కులగణన చేపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ లంకాపట్నంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు అయినా ఇంత వరకు కులగుణన జరగలేదని చెప్పారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి కులగుణన చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దుర్గారావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండలస్థాయి వాలీబాల్ పోటీలు



విన్నర్, రన్నర్‌గా నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేస్తున్న రమణరాజు, తదితరులు

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురంలో లుక్‌ఫర్ ఫ్యూచర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించిన మండలస్థాయి వాలీబాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. 22 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో బుధరాయవలస, గాతాడ జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. బుధరాయవలస జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.12 వేల నగదు బహుమతి, ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన గాతాడ జట్టుకు రూ.8 వేల నగదు బహుమతి అందజేశారు. బహుమతుల ప్రదానంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు ఎస్.రామరాజు, ఎస్.వెంకటనారాయణరాజు, ఎస్.కృష్ణమూర్తిరాజు, అడ్డాల కృష్ణమూర్తిరాజు, ఎస్.రమణరాజు, ఎస్.రామ్మూర్తిరాజు, ఎస్.సీతారామరాజు పాల్గొన్నారు.

రహదారులతో పల్లె ప్రగతి..

- నాలుగున్నరేళ్లలో 23 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, తారురోడ్ల నిర్మాణం
- రూ. 5.20 కోట్లతో నాలుగు తారురోడ్లు, రూ. 2.21 కోట్లతో 9 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం



రూ. 8 కోట్లతో నిర్మించిన బద్దుకొండపేట- గుండాలపేట- కొత్తూరు రోడ్డు

విజయనగరం రూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన కొనసాగుస్తోంది. ఇప్పటికే గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్, రైతుభరోసా కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తి చేస్తుండగా, రహదారుల నిర్మాణానికి అంతే ప్రాధాన్యం ఇస్తూ నిధులు మంజూరు చేయడంతో గ్రామాల్లో పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వం గ్రామీణ రహదారులపై చిన్నచూపు చూడడంతో ఏళ్లుగా పాడైన రహదారులతో ప్రజలు నరకయాతనపడ్డారు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న విజయనగరం మండలంలో అనేక గ్రామాలకు కలుపుతూ సుమారు 14 కిలోమీటర్ల మేర నాలుగు రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి కృషితో రూ. 5.20 కోట్లు మంజూరు కావడంతో తారురోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. అలాగే మండల పరిషత్ నిధులు, ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో రూ. 2.21 కోట్లతో 9 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. మండలంలోని బదుకొండపేట రోడ్డు పాడైనా గత ప్రభుత్వాలు నిధులు విదల్చకపోవడంతో సుమారు 2 కిలోమీటర్ల మేర పెద్ద పెద్ద గోతులు ఏర్పడి గ్రామస్తులు నానా అవస్థలు పడేవారు. అయితే బదుకొండపేట గ్రామం నుంచి కోరుకొండ పంచాయతీ కొత్తూరు గ్రామం వరకు రూ. 4.5 కోట్ల నిధులతో సుమారు 8.7 కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. అలాగే కోరుకొండపాలెం నుంచి గంట్యాడ మండలం పేదవేమలి



నారాయణపురం గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు

జంక్షన్ వరకు 2.5 కిలోమీటర్ల తారురోడ్డు మరమ్మతులకు రూ. 35 లక్షల నిధులు మంజూరుచేయగా రోడ్డుకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకువచ్చారు. సారిక గ్రామం నుంచి రైల్వేగేట్ వరకు 0.8 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు కాగా పనులు పూర్తి చేశారు. మండలంలోని రాకోడు గ్రామం నుంచి పినవేమలి రోడ్డు జంక్షన్ వరకు సుమారు 1.8 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ. 25 లక్షలు మంజూరు చేయగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణాలు పూర్తి కావడంతో ఆయా గ్రామాల ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మలిచర్ల గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు

సీసీ రోడ్ల నిర్మాణం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలో గ్రామాల్లో ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో సుమారు 7 కిలోమీటర్ల సీసీ రోడ్లను రూ. 2.13 కోట్లతో నిర్మాణం పూర్తి చేశారు. అలాగే మండల పరిషత్ నిధుల నుంచి 179 మీటర్ల రోడ్డు నిర్మాణాన్ని 8.67 లక్షలతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఏళ్ల నాటి సమస్య తీరింది



ఎన్నో ఏళ్లుగా గోతులతో నిండిన రోడ్డుతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో రోడ్డు నిర్మాణం జరగడం అభినందనీయం. రహదారి సమస్య తీరడంతో గ్రామస్తులు సులువుగా రాకపోకలు సాగిస్తున్నారు.

– సిరియాల.అప్పలనాయుడు, బద్దుకొండపేట గ్రామం, విజయనగరం మండలం

అన్ని రంగాల్లో నగరాన్ని అభివృద్ధి చేశా..

- మరోసారి అవకాశం ఇస్తే యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించండి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకం ఉంచి గెలిపించడం ద్వారా కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపించామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రత్యేక దృష్టి సారించి వారి సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. మరోసారి అవకాశం ఇస్తే యవతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు తనకు చివరవని విజయనగరం నియోజకవర్గ ప్రజలు మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. నగరంలోని 30, 31 డివిజన్లకు సంబంధించి పద్మావతినగర్ సమీపంలోని వసంత విహార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పబ్లిక్ కుళాయిలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్లకు అపార్ట్‌మెంట్ వాసులు ఘన స్వాగతం పలికారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, వసంతవిహార్ ఏర్పాటై దాదాపు 15 ఏళ్లు కావొస్తున్నా, ఈ ప్రాంతంలో కనీస అవసరాలు ఏర్పాటు కాలేదన్నారు. తాను శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత ప్రజలకు అవసరమైన సదుపాయాలన్నీ కల్పిస్తున్నట్లు చెప్పారు. కొత్త ధర్మపురిలో వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేసి అక్కడ నుంచి ప్రత్యేక పైపులైన్ల ద్వారా కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. మరోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైతే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు, మారం బాలబ్రహ్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు ఎన్ని లక్ష్మణరావు, పతివాడ గణపతి రావు, తదితరులు పాల్గొన్నారు.



కుళాయిను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

భావితరాలకు సంస్కృతీ, సంప్రదాయాలు

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: మన సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్ అన్నారు. శనివారం స్థానిక రాజీవ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్సాహవంతులైన బాలలు, యువజనులకు పతంగుల పోటీ (గాలిపటాల పోటీలను) నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి స్థానిక రాజీవ్ స్టేడియంలో నిర్వహించనున్న గాలిపటాల పోటీలలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ముందుగా పేర్లను రాజీవ్ స్టేడియంలో నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో సూరిబాబు, పిలక శ్రీను, కనకల గిరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- సీతం విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం టౌన్: వెయిట్ లిఫ్టింగ్‌లో కళాశాల విద్యార్థిని పల్లవి అద్భుతమైన ప్రతిభ కనబరచడం ఎంతో ఆనందంగా ఉందని, రానున్న రోజుల్లో ఆమె ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆకాంక్షించారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జాతీయ సీనియర్, జూనియర్ విభాగాల్లో పల్లవి పాల్గొని 64 కిలోల విభాగంలో రజతం, కాంస్య పతకాలు సాధించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారిణి కెప్టెన్ ఎం.సత్యవేణి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లా రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని అభినందనలు తెలిపారు.



పల్లవిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు

ఆకట్టుకున్న రంగోలి పోటీలు



ముగ్గును తిలకిస్తున్న సీరియల్ నటి పూజామూర్తి, వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు, తదితరులు

విజయనగరం టౌన్: సనాతన సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించే విధంగా రంగోలి పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని గుండమ్మ కథ సీరియల్ నటి పూజామూర్తి అన్నారు. వాజీ చానల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలకు మహిళల నుంచి అనూహ్య స్పందన లభించింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పూజామూర్తి మాట్లాడుతూ.. రంగుల పోటీలు సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. మగువల చేతుల్లోంచి అలవోకగా నేలపైకి జాలువారి, చూపరులను కట్టిపడేసే అద్భుతమైన ఒక నైపుణ్యం ముగ్గు అని తెలిపారు.

వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, 28 ఏళ్లుగా భారతీయ సనాతన సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణలో భాగంగా మహిళలను ప్రోత్సహించేందుకు రంగోలి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం ఆనందంగా వర్ధిల్లాలి



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నియోజకవర్గ ప్రజలకు స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి కుటుంబం పాడిపంటలు, భోగ భాగ్యాలతో అలరారాలని ఆకాంక్షించారు.

తెలగ కులస్తులు రాణించాలి

- తెలగా కులస్తుల సంఘ జిల్లా అధ్యక్షుడు పల్లంట్ల వెంకట రామారావు



చిక్కాల దంపతులను సత్కరిస్తున్న తెలగా సంఘ ప్రతినిధులు

నెల్లిమర్ల: జిల్లాలో అధిక శాతమున్న తెలగా కులస్తులు అన్నిరంగాల్లో రాణించాలని తెలగా కులస్తుల సంఘ జిల్లా అధ్యక్షుడు పల్లంట్ల వెంకట రామారావు ఆకాంక్షించారు. పూసపాటిరేగ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన చిక్కాల అరుణకుమారిని జిల్లా తెలగా సంక్షేమ సంఘం శనివారం ఘనంగా సన్మానించింది. నెల్లిమర్ల పట్టణంలోని చిక్కాల స్వగృహం వద్ద జరిగిన సత్కార కార్యక్రమంలో వెంకట రామారావు మాట్లాడుతూ, తమ కులానికి చెందిన మహిళ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, 5, 11 వార్డుల కౌన్సిలర్లు చిక్కాల సుమతి, చిక్కాల సంతోష్‌కుమార్‌లను సంఘం తరపున సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గంటా అప్పలరాజు, గంటా సతీష్, పి. లక్ష్మణరావు, ఎం. శ్రీనివాసరావు, యాలాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారుకు సెలవు లేదు

శృంగవరపుకోట: స్థానిక రైతుబజార్‌కు ఆదివారం సెలవు లేదని ఎస్టేట్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ చెప్పారు. సంక్రాంతి పండగ సందర్భంగా వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం జిల్లా వ్యాప్తంగా రైతు బజార్లు నిర్వహించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు.ఈ మేరకు పట్టణంలో రైతు బజార్‌ను ఆదివారం తెరవనున్నట్లు వివరించారు. రైతులు యథావిధిగా కూరగాయల అమ్మకాలు చేసి సహకరించాలని, వినియోగదారులు రైతు బజార్ సేవలు వినియోగించుకోవాలని కోరారు.

విద్యాలయాల్లో సంక్రాంతి శోభ



ఏపీ మోడల్ స్కూల్‌లో భోగి మంట చుట్టూ విద్యార్థులు

డెంకాడ: భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతో విద్యాలయాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగల విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరిస్తున్నారు. పాఠశాలల్లో భోగి మంటలు వేయడంతో పాటు విద్యార్థులచే వివిధ వేషధారణలు వేయించి వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తున్నారు. పాశ్చాత్య సంస్కృతి పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో విద్యాలయాల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



లెండి ఇంజినీరింగ్ కళాశాలలో సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు, అధ్యాపకులు

వివేకానంద జీవిత చరిత్ర తెలుసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆశయ రమణ

చీపురుపల్లి: స్వామి వివేకానంద జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకుని, ఆయన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ చెప్పారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని జి.వి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులు, యువతకు శనివారం వివేకానంద జీవిత చరిత్రను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద రచించిన పుస్తకాలను విద్యార్థులు, యువత తప్పనిసరిగా చదవాలన్నారు. ప్రపంచ దేశాల్లో భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పిన గొప్ప మహనీయుడు వివేకానంద అని అన్నారు. అనంతరం వివేకానంద సందేశాత్మక పుస్తకాలను పంపిణీ చేశారు.

కిటకిటలాడిన వారపు సంత



దత్తిరాజేరు మండలం పెదమానాపురంలో కిటకిటలాడుతున్న పొట్టేళ్ల సంత

దత్తిరాజేరు: సంక్రాంతి పండగ నేపథ్యంలో పెదమానాపురం వారపు సంత వ్యాపారస్తులు, కొనుగోలుదారులతో శనివారం కిటకిటలాడింది. సంతకు వచ్చిన వారు కుండలు, దుస్తులు, పూజా సామగ్రిని పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. పొట్టేళ్లు, కోళ్లకు మంచి గిరాకీ పలికింది.

మార్కెట్‌లో సందడి

చీపురుపల్లి: సంక్రాతి పండగ సందర్భంగా పట్టణంలోని మార్కెట్‌లో ఆదివారం సందడి నెలకొంది. దుస్తులు నుంచి కిరాణా సామగ్రి, పెద్దలకు చూపించే పంచెలు, చీరలు కొనుగోలుకు గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చీపురుపల్లి ప్రధాన మార్కెట్ కావడంతో కొనుగోలుదారులు తాకిడి పెరిగింది. పెద్ద దుకాణాలతో పాటు ఫుట్‌పాత్ వ్యాపారాలు కూడా జోరుగా సాగాయి.



చీపురుపల్లి మెయిన్‌రోడ్‌లో ఫుట్‌పాత్‌పై పంచెలు, చీరలు కొనుగోలు చేస్తున్న ప్రజలు